

తడారిపోతున్న పల్లె గొంతు

ఎండలు మండుతున్నాయి... మార్చిలోనే 41 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి.. పల్లెసీమల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి.. కందనవోలు జల కంఠాభరణంగా తుంగభద్ర నది ప్రవహిస్తున్నా దాహం తీరడం లేదు. ఎల్లెల్సీ, హంద్రీనీవా కాలువలు ఉన్నా.. గ్రామాల్లో తాగునీటికి అల్లాడుతున్నాయి.. జిల్లాలో 76 గ్రామాల్లో అరకొర తాగునీటి వసతులే ఉన్నాయి.. పల్లెలకు నీరు సరఫరా చేయడానికి రూ.3.90 కోట్లు నిధులు కావాలంటూ గ్రామీణతాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పల్లెల్లో తాగునీటి ఎద్దడి ఎలా ఉందో తెలుసుకోడానికి ఇది చాలు. పశ్చిమ ప్రాంతంలోని మెజార్టీ గ్రామాల దాహం తీర్చడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- తాగునీటికి తల్లడిల్లుతున్న పశ్చిమ గ్రామాలు
- 76 పల్లెల్లో తీవ్ర ఎద్దడి
- నీటి రవాణాకు రూ.3.90 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవు

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 484 పంచాయతీలు, 237 మజరా గ్రామాలు కలిపి 721 గ్రామాలు ఉన్నాయి. 33 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) 354 గ్రామాలకు శుద్ధి చేసిన (ఫిల్టర్) తాగునీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మిగిలిన 367 గ్రామాలకు చేతిబోర్లు, పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ పథకాలపై ఆధార పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటితే.. ఈ పథకాలు ఒట్టిపోయి తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. సీపీడబ్ల్యూఎస్ పరిధిలో కూడా శివారు గ్రామాల్లో వారంలో ఒకటిరెండు రోజులు కూడా నీటి సరఫరా చేయడం లేదు. వేసవి ఎండలు బలపడడంతో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యలు కూడా తీవ్రం అవుతున్నాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో నీటి సమస్యలు జఠిలం అవుతాయని క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

76 గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి

రాష్ట్రంలో కరువు మండలాలుగా గుర్తిస్తూ విపత్తుల నిర్వహణ శాఖ గత ఏడాది అక్టోబరు 29న జీఓ ఎంఎస్ నంబరు.15 జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాలో 21 మండలాల్లో తీవ్రమైన కరువు, రెండు మండలాలను మధ్యంతర కరువు ప్రాంతాలుగా గుర్తించింది. ఈ నివేదిక ప్రకారం జిల్లాలో 76 గ్రామాల్లో వేసవిలో తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కునే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆ గ్రామాలకు తాగునీటి రవాణా (ట్రాన్స్‌పోర్టేషన్) కోసం రూ.3.90 కోట్లు, చేతిబోర్లు, పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ పథకాల బోర్లు డీపెనింగ్, ఫ్లషింగ్, ఇతర మరమ్మతుల కోసం రూ.2.88 కోట్లు కావాలి. మొత్తం రూ.6.91 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు పూర్తి చేసుకున్నా.. ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని రవాణా చేయాల్సి గ్రామాలు ఉన్నాయంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతున్నాయి.

తుంగభద్ర ఒట్టిపోతే.. పల్లె దాహం తీరదు!

జిల్లాలో 33 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) ఉంటే.. ఎస్ఎస్ ట్యాంకులు 26 ఉన్నాయి. అందులో 24 ట్యాంకుల్లో 75 శాతం, రెండు ఎస్ఎస్ ట్యాంకుల్లో 25-50 శాతం మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి. అవి కూడా 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులు కావడంతో పెరిగిన జనాభాకు సరిపడా తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి ఉంది. కౌతాళం మండలం హాల్వి, కోసిగి మండలం సాతనూరు, మంత్రాలయం మండలం మంచాల, నందవరం మండలం చిన్నకొత్తిలికి, నాగులదిన్నె, సుంకేసుల సీపీడబ్ల్యూఎస్ పథకాలు తుంగభద్ర ఆధారంగా నిర్మించారు. 1989లో అమలు చేసిన ఎస్‌పీపీ వాటర్ స్కీం, 1999లో అమలు చేసిన నంద్యాల వాటర్ సప్లయ్ స్కీంలో భాగంగా వీటిని నిర్మించారు. అప్పట్లో తుంగభద్రలో ఏడాది పొడవున నీటి ప్రవాహం ఉండడంతో ఎస్ఎస్ ట్యాంక్‌లు లేకుండా నది ప్రవాహ నీటిని ఎత్తిపోసి.. ఆ శుద్ధి చేసి సరఫరా చేసేవారు. ప్రస్తుతం తుంగభద్రకు వరద రోజులు తగ్గిపోయాయి. వేసవిలో చుక్కనీరు లేకుండా ఎండిపోతుంది. హాల్వి, మంచాల నీటి పథకాలకు మాత్రమే ఆరేడేళ్ల క్రితం ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించారు. చిన్నకొత్తిలికి, నాగులదిన్నె నీటి పథకాలు నదిపై ఆధారపడ్డాయి. నది ఎండిపోతే ఆ స్కీం పరిధిలోని గ్రామాలకు నీటి కష్టాలు తప్పడం లేదు. జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలో భాగంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది.



హొళగంద మండలం నెరిణికి తండా గ్రామంలో



ఆస్పరి మండలం తొగలగల్లు గ్రామంలో నీటి కష్టాలు

నీటి రవాణా కోసం ప్రతిపాదించిన మండలాలు, గ్రామాలు

మండలం	గ్రామాలు
ఆదోని	బిల్లెకల్లు, బస్సాపురం, చిన్నగోనేహాల్, చిన్నహరివాణం, గణేకల్లు, జాలిమంచి, కుప్పగల్, పాండవగల్లు, కలకలకొండ
కౌతాళం	బదినేహాల్, కుంటనహాల్, మదిరె, పొదలకుంట, తోవి, ఉప్పరహాల్
ఆస్పరి	జొహరాపురం, డి. కోటకొండ, తొగలగల్లు,
మంత్రాలయం	చెట్నిహల్లి, కల్లుదేవకుంట
కోసిగి	దుద్ది, కోసిగి, నేలకోసిగి
హాలహర్వి	మెదేహాల్, ఎంకేపల్లి, బివినేహాల్, శ్రీధర్‌హాల్
గూడూరు	గుడిపాడు, గుడిపాడు, పొన్నకల్లు, కె. నాగులాపురం, మల్లాపురం, పెంచికలపాడు
సి.బెళగల్	సి.బెళగల్, బ్యాతోలి, పలుకుదొడ్డి, పోలకల్
కోడుమూరు	బైనదొడ్డి, మెరుగుదొడ్డి, పులకుర్తి, రామచంద్రాపురం
మద్దికెర	మదనంతాపురం, బురుజుల
పత్తికొండ	చక్రాల, చందోలి, అటికలగుండు, నలకదొడ్డి
తుగ్గలి	బాటతాండ, లింగనేనిదొడ్డి, సీజీ తాండ, చెరువు తాండ, జప్లతాండ, లక్ష్మితాండ, మిద్దెతాండ, వాగులగుడిసెలు, లంకాయపల్లి, రోళ్లపాడు, ఆర్ఎస్ పెండేకల్లు, రోళ్లపాడు తాండ
కల్లూరు	ఎ. గోకులపాడు, పర్ల, నలకాపురం, తడకనపల్లె, ఉల్లిందకొండ
ఓర్వకల్లు	చెన్నంశెట్టిపల్లి, గుడుంబావితాండ, తిప్పాయిపల్లి, ఉప్పలపాడు, వెంకటాపురం
కర్నూలు	అంబేద్కర్‌నగర్, బసవాపురం, దిగువపాడు, ఆర్‌కే దుద్యాల, ఆర్.కొంతలపాడు, రేమట, తులిసాపురం

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో వేసవిలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. ఇప్పటికే అవసరమైన గ్రామాల్లో బోర్లు, పీడబ్ల్యూఎస్ పథకాలు మరమ్మతులు చేస్తున్నాం. జిల్లాలో 76 గ్రామాల్లో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని అంచనా వేశాం. ఆ గ్రామాలకు తాగునీటి రవాణా చేసేందుకు ముందస్తు ప్రణాళికతో రూపొందించాం.

- నాగేశ్వరరావు, ఎస్ఈ, గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ్యం విభాగం, కర్నూలు



శభాష్‌పురంలో నీటి కోసం ఆటోలో కిలో మీటర్ల దూరం వెళ్లాల్సిందే

జిల్లాలో తాగునీటి వివరాలు

- మొత్తం గ్రామాలు : 721
- సీపీడబ్ల్యూఎస్ స్కీంలు, నీళ్లిచ్చే గ్రామాలు : 33 స్కీంలు, 354 గ్రామాలు
- నిర్వహణ వ్యయం : రూ.49.28 కోట్లు
- తీవ్ర నీటి ఎద్దడి గ్రామాలు : 76
- నీటి రవాణా, బోర్ల మరమ్మతుల అంచనా : రూ.6.91 కోట్లు

ఇద్దరు ఈఈల సస్పెండ్

- ఆరు నెలలైనా విధుల్లో చేరకపోవడంపై చర్యలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం..

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరులో బదిలీ చేస్తే.. ఆరు నెలలు కావస్తున్నా విధుల్లో చేరని ఇద్దరు ఇంజనీర్లపై ప్రభుత్వం కొరడా విసిరింది. మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కాంపిటెంట్ అథారిటీ అధికారి ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ విడిచి వెళ్లరాదని ఆదేశించారు. ఈ మేరకు జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సెప్టెంబరు 22న ఇరిగేషన్ శాఖ కర్నూలు ప్రాజెక్ట్ ఆఫీస్ డిప్యూటీ సీఈగా పని చేస్తున్న ఎస్. లక్మానాయక్‌ను శ్రీశైలం డ్యాం మెయింటెనెన్స్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. అలాగే.. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ (ఐసీ) పరిధిలో తెనాలి కేడబ్ల్యూ డివిజన్ ఈఈగా పని చేస్తున్న ఎస్. మల్లికార్జునను శ్రీశైలం డ్యాం మెయింటెనెన్స్ సర్కిల్ సీఅండ్ బీ డివిజన్ ఈఈగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆరు నెలలు కావస్తున్నా విధుల్లో చేరలేదు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి విధుల్లో చేరకపోవడంతో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీ అండ్ ఏ) రూల్స్ 1999లోని రూల్ 8లోని సబ్ రూల్ (1) ప్రకారం ఈఈలు ఎస్. లక్మానాయక్, ఎస్. మల్లికార్జునలను సస్పెండ్ చేస్తూ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వీరు సస్పెన్షన్‌లో కొనసాగుతారని జలవనరుల శాఖ స్పెషన్ సీఎస్ సాయిప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అదే క్రమంలో సస్పెన్షన్ కాలంలో కాంపిటెంట్ అథారిటీ ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ దాటి వెళ్లరాదని, సస్పెన్షన్ సమయంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జీవనాధారం కోసం భత్యం చెల్లిస్తామని అన్నారు. ఈ ఈఈలు లక్మానాయక్, మల్లికార్జునల వివరణ కోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పెరిగిన పత్తి ధర

క్వింటా గరిష్ఠంగా రూ.7629

ఆదోని అగ్రికల్చర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు సోమవారం పెరిగాయి. నెల రోజుల తర్వాత పత్తి ధరల్లో కదలిక రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7629 పలికింది. క్వింటానికి రూ.200పైగా ధర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో దూది ధర పెరగడం వల్ల స్థానిక మార్కెట్లో ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు.



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

జిల్లా జైలు తనిఖీ



మాట్లాడుతున్న జి.కబర్ధి

కర్నూలు లీగల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పంచలింగాలలోని జిల్లా జైలును కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి మంగళవారం తనిఖీ చేశారు. ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్ష పూర్తి చేసుకుని మంచి పౌరులుగా జీవించాలని కోరారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం కావాలంటే తాము న్యాయవాదిని ఉచితంగా నియమిస్తామని ఆయన తెలిపారు. ఆ తర్వాత ఆయన ఖైదీలకు అందించే ఆహారాన్ని, రేషన్‌ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవా లని ఆయన జైలు అధికారులను ఆదేశించారు. బెయిల్ మంజూరైన ఖైదీలకు జామీనుదారులు లేని వారికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ. లీలా వెంకటశేషాద్రి, న్యాయవాది శివరాం జైలు అధికారులు పాల్గొన్నారు.

పిల్లల ఆధార్ నమోదును పూర్తి చేయాలి: కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 0-5 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ వివరాల నమోదును పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంటు, ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్ అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లల ఆధార్ నమోదులో జిల్లా వెనుకబడి ఉందన్నారు. జిల్లాలో ఉన్న 106 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, రోజుకు 20 చొప్పున నెలలోపు ఆధార్ ఎన్‌రో ల్‌మెంటును పూర్తి చేయాలని జడ్పీ సీఈవో, ఐసీడీఎస్ పీడీలను ఆదేశించారు. ఐదేళ్ల తర్వాత ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలని, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య కూడా మరొకసారి కూడా అప్‌డేషన్ చేసుకో వాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఈవో శామ్యూల్ పాల్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీఎల్‌డీవో రమణారెడ్డి పాల్గొన్నారు.



కోనేటిలో కనులవిందుగా సాగుతున్న స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం

వైభవంగా తెప్పోత్సవం

- ఉభయ దేవేరులతో విహరించిన శ్రీవారు
- దిగువలో ముగిసిన ప్రహ్లాద వరదుని ఉత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 18(ఆంధ్రజ్యోతి) : నమో నారసింహా.. అహోబిలేశా అని భక్తులు పారవశ్యంతో శ్రీవారిని స్తుతిస్తుండగా శ్రీదేవి, భూదేవి సమేతుడిగా కొలువైన ప్రహ్లాద వరదస్వామి కోనేరులో తెప్పపై విహరించారు. దిగువ అహోబిలంలో ఆదిదేవునికి మూడు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిసాయి. తెప్పోత్సవంలో భాగంగా అహోబిలానికి చెందిన శ్రీ ప్రహ్లాద వరద కైంకర్య సభ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ స్వామివారికి ఉదయం పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తిరుమంజనం, అభిషేకం, అర్చన, మంగళ హారతి నిర్వహించారు. ఉభయదేవేరులతో పల్లకిలో కొలువైన ప్రహ్లాదవరదునికి తెప్పోత్సవం నిర్వహించారు.





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్

వైసీపీ భక్త ఎస్ఐపై వేటు

- ఆస్పరి ఎస్ఐ సీ. వెంకటనరసింహులు సస్పెండ్
- చిత్తూరు జిల్లాలో చేసిన అరాచకాలు వెలుగులోకి..
- అధికార అండదండలతో చిత్తూరు నుంచి కర్నూలుకు
- జిల్లా దాటి వెళ్లకూడదంటూ ఆదేశాలు



సస్పెండయిన ఆస్పరి ఎస్ఐ వెంకట నరసింహులు

ఆదోని/చిత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పలువురు పోలీసు అధికారులు కండువా వేసుకొని వైసీపీ నాయకుల్లా పనిచేసిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో అయితే మరీ ఏకపక్షంగా పనిచేశారు. టీడీపీ శ్రేణులే లక్ష్యం చేసుకుని అక్రమ కేసులు, హత్యాయత్నం కేసుల్ని నమోదు చేసి ఇబ్బంది పెట్టిన ఆస్పరి ఎస్ఐ సి.వెంకట నరసింహులు మంగళవారం సస్పెండ్ అయ్యారు. చిత్తూరు జిల్లా సోమల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో ఎస్ఐ సీవీ నరసింహులు ఓ కేసులో వసూళ్లకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆయనను సస్పెండ్ చేసి కర్నూలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సరెండర్ కావాలని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ తాజాగా ఉత్తర్వులు విడుదల చేశారు. తమకు తెలియకుండా కర్నూలు హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళకూడదు అంటూ ఆదేశించారు. వైసీపీ హయాంలో పెద్దఎత్తున అరాచకాలు చేసిన అతను తెలివిగా ప్రభుత్వం మారిన వెంటనే చిత్తూరు జిల్లా నుంచి బదిలీ చేసుకుని కర్నూలు జిల్లా ఆస్పరి స్టేషన్‌కు వెళ్లారు. కానీ, అతను చిత్తూరు జిల్లా సోమలలో చేసిన అరాచకాలు వెలుగులోకి రావడం, రికార్డెడ్‌గా ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు వేటు వేశారు. సస్పెన్షన్ ఉత్తర్వుల్లో కూడా అతడిపై వచ్చిన ఆరోపణల్ని ప్రస్తావించారు. ఇదిలా ఉండగా సదరు అవినీతి ఎస్ఐపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితయ్యాయి. పోలీస్ ఉన్నతాధికారులు ఆంధ్రజ్యోతి కథనాలను కూడా పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

మిగతా 7వ పేజీలో

కలిసి వచ్చిన పసుపు

పొలంలో కుప్పగా పోసిన పసుపు కొమ్ములు



పచ్చ బంగారం.. పసుపు పంట ఈ ఏడాది రైతుకు కలిసి వచ్చింది. వట్టి పసుపు ధర ఒకింత పర్వాలేదనిపించేలా ఉంది. దీంతో పంట తవ్వకాలు ఊపందుకున్నాయి. చాగలమర్రి మండలంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు పసుపును సాగు చేశారు. నియోజకవర్గ పరిధిలో చాగలమర్రి మండలంలో అధికంగా 300 ఎకరాల్లో పసుపు పంట సాగైంది. ఒక్క చిన్నవంగలి గ్రామంలోనే 200 ఎకరాల దాక పసుపు సాగు చేశారు. వ్యవసాయాధికారుల లెక్కల మేరకు ఆళ్లగడ్డలో 23 హెక్టార్లు, రుద్రవరంలో 75 హెక్టార్లు, శిరివెళ్లలో 15 హెక్టార్లు పసుపు సాగు చేశారు. ఒక ఎకరాలో ఈ పంట సాగుకు రూ.1.30 లక్షల దాక పెట్టుబడి కింద వెచ్చించారు.

- జోరుగా పసుపు తవ్వకాలు
- ఆశాజనకంగా దిగుబడి
- పర్వాలేదనిపిస్తున్న ధరలు



చిన్నవంగలిలో పసుపు కొమ్ములను కోస్తున్న కూలీలు

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పసుపు పంటను ఈ ఏడాది తెగుళ్లు అధికంగా సోకాయి. మొదట పైరు బాగా కనిపించిన పెరిగే కొద్ది దుంపకుళ్లు సోకింది. చాలా మంది రైతుల పొలాల్లో తెగుళ్ల ప్రభావంతో దిగుబడి తగ్గింది. పసుపు కొమ్ముకు చుట్టిన రెమ్మలు పుచ్చుపట్టి దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గింది.

ఆశాజనకంగా ధరలు

మార్కెట్‌లో వట్టి పసుపు క్వింటం రూ.9,500 పలుకుతుంది. గత ఏడాది వట్టి పసుపు క్వింటం రూ.15 వేలు పైబడి ధర పలికింది. ప్రస్తుతం రూ.9,500 నుంచి రూ.10 వేల వరకు ఉంది. అయితే ఈ ఏడాది కూడా కొత్త పసుపు ధర పెరుగుతుందని ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు మార్కెట్‌లో కూడా క్వింటం రూ.10 వేలు ధర పలుకుతుండటంతో రైతన్నలో ఆనందం వ్యక్తమవుతోంది. ఎకరాకు రూ.30 వేలు నుంచి రూ.40 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు. దిగుబడితో పాటు క్వింటం రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు అమ్మితే మంచి లాభాలు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పసుపు పంట రైతులకు ఊరట కలిగించింది.

ఈ ఏడాది పసుపు కలిసి వచ్చింది



ఏడున్నర ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. అయితే ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుండటంతో అన్ని ఖర్చులు పోను రూ.20 వేలు నుంచి రూ.30 వేలు మిగులుతోంది. ఈ ఏడాది కొంచెం మేలుగా ఉందని, గత ఐదేళ్ల నుంచి పసుపు సాగులో తీవ్రంగా నష్టపోయాం. ధర పెరిగితే మంచి లాభాలు వస్తాయి.

- గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

కష్టానికి తగ్గ ఫలితం



పసుపు సాగులో కష్టానికి తగ్గ ఫలితం ఉంది. 1.50 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల దాకా వచ్చింది. ఉన్న ధరతో పసుపు విక్రయిస్తే కొంత ఊరట ఉంది. ధర పెరిగితే మరింత లాభాలు వస్తాయి. ఈ ఏడాది పసుపు పంట ఆశాజనకం.

-రమణయ్య, రైతు, చిన్నవంగలి

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి



పసుపు దిగుబడిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే రైతులకు మరింత మేలు జరుగుతుంది. 2 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. ఎకరాకు రూ.130 లక్షలు ఖర్చు చేశా. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.9,500 పలుకుతుండటంతో ఈ ధరకు అమ్మితే కొంత మేర లాభం వస్తుంది. రూ.15 వేలు ధర పలికితే రైతుకు మంచి లాభాలు వస్తాయి.

- నరసింహారెడ్డి, రైతు, చిన్నవంగలి

గజ వాహనంపై లక్ష్మీమాధవుడు

పుష్ప పల్లకిలో స్వామి, అమ్మవార్లు



గజవాహన సేవలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం మాధవుడు లక్ష్మీ సమేతుడై గజవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా పురోహితులు ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను రాజగోపురం గుండా ఆలయం వెలుపలికి తోడ్కొని వచ్చి గజవాహనంపై ఆశీనులను గావించారు. దీంతో గోరంట్ల గ్రామవాసులు వాహనానికి ముందు, ఎర్రగుడి ప్రజలు వెనుక భాగంలో ఉంటూ వాహనసేవకులయ్యారు. గజవాహనసేవను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రి 11 గంటల సమ యంలో లక్ష్మీమాధవుడు పుష్పపల్లకిలో విహరించారు.

అవాంతరాలు: లక్ష్మీ మాధవులకు మంగళవారం నిర్వహించిన గజవాహనసేవ అవాంతరాల నడుమ ముగిసింది. మధ్యాహ్నం ఆలస్యంగా ప్రారంభమైన వాహనసేవలో ఎర్రగుడి వాసులు వెనుక భాగంలో ఉన్నారు. గోరంట్ల గ్రామప్రజలు ముందుభాగంలో నిలబడ్డారు. అయితే వాహనసేవ జరుగుతున్న క్రమంలో కాడి విడిపోవడం, తాళ్లు తెగడం వంటి అవాంతరాలు ఏర్పడ్డాయి. ఒక దశలో గజవాహనానికి వెనుక భాగంలో బలప్రయోగం అధికం కావడంతో వేగంగా వెనక్కి వెళ్లింది. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్‌కు కాడిమాను తగిలింది. దీంతో ఆయన అస్వస్థతకు గురికాగా ఆసుపత్రికి తరలించారు. సోమవారం జరిగిన గరుడవాహనసేవలో ఎర్రగుడికి చెందిన ఓ వ్యక్తి కాలికి గాయమైన సంగతి తెలిసిందే.

ప్రారంభమైన ఇంటర్ పేపర్ మూల్యాంకనం

ఏప్రిల్ రెండోవారంలో ఫలితాలు వచ్చే అవకాశం

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పేపర్ మూల్యాంకనం చురుగ్గా సాగుతోంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తికావడంతో వెంటనే పేపర్ మూల్యాంకనం ప్రారంభించారు. డీఐఈవో సునీత పర్యవేక్షణలో 300 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్‌లు, 50 మంది చీఫ్ ఎగ్జామినర్‌లు, 50 మంది స్క్రూటినైజర్‌లు, 8 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌లతో మూల్యాంకనం జరుగుతోంది. సోమవారం నుంచి మ్యాథ్స్, ఇంగ్లీష్, సివిక్స్, హిస్టరీ, తెలుగు పేపర్‌ల మూల్యాంకనం జరుగుతోందని, ఈనెల 22వ తేదీ నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, 24వ తేదీ నుంచి కెమిస్ట్రీ, 26వ తేదీ నుంచి బాటనీ, జువాలజీల వాల్యూవేషన్ జరుగుతుందని డీఐఈవో తెలిపారు. ప్రతిరోజు ఒక్కో అధ్యాపకుడు 30 జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారని వివరించారు. ఏప్రిల్ 4వ తేదీలోపు మూల్యాంకనం పూర్తిచేసి అదే నెల రెండోవారం కానీ మూడో వారం కాని ఫలితాలను వెల్లడించేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది.



ఇంటర్ పేపర్ వాల్యూయేషన్ జరుగుతున్న నంద్యాల ప్రభుత్వ బాలికల కళాశాల

అభివృద్ధి బాటలో నడవాలి

జాతీయస్థాయి ఐటీ మీట్‌లో ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



వీసీని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ గురించి తెలుసుకోవాలని రాయలసీమ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు పేర్కొన్నారు. నంద్యాల శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్స్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఐటీ మీట్‌కు వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వైస్ ఛాన్సలర్‌తో పాటు కళాశాల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, కార్యదర్శి విజయకుమారి, ప్రిన్సిపాల్ కెబివి సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ ఏఎస్ ప్రగతిరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ నాయకత్వంలో యూనివర్శిటీ, కళాశాలలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం కోడ్ క్వెస్ట్, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, మైండ్ మారథాన్ వంటి కల్చరల్ యాక్టివిటీస్ గురించి వివరించి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో ఈవీఎంలు భద్రపరిచిన గోదాములను కలెక్టర్ పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాముల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, ఎన్నికల విభాగం తహసీల్దార్ జయప్రసాద్‌లతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

22న గరికపాటి నరసింహారావు కర్నూలుకు రాక

కర్నూలు కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని విజ్ఞాన సేవా సమితి (వీఎస్ఎస్) ఆధ్వర్యంలో, ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు బి.క్యాంపులోని టీజీ లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 'ఉగాది మహోత్సవం' కార్యక్రమానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు విచ్చేస్తున్నట్లు వీఎస్ఎస్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ ఎండీవీఎన్ రామశర్మ వ్యవహరిస్తారని, ప్రధాన ఉపన్యాసకులుగా డాక్టర్ గరికపాటి నరసింహారావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లస్టర్ యూనివర్శిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, శ్రీశైలంలోని అఖిల భారత కరివేన నిత్యాన్నదాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ ఎస్.వేణుగోపాల్ హాజరవుతారని, ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

కాలువలపై సోలార్ వెలుగులు



ఎస్ఈ, ఈఈలతో సమీక్షిస్తున్న కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా

- 'కెనాల్ టాప్ సోలార్ ప్లాంట్'పై ప్రభుత్వం దృష్టి
- అవసరమైన స్థలాలు గుర్తించాలని ఆదేశాలు
- ఎస్ఈ, ఈఈలతో సమీక్షించిన ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా
- రేపు స్పెషన్ సీఎస్ ప్రత్యేక సమావేశం

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సౌరశక్తితో వెలుగులు నింపాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కాలువలు, ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు కసరత్తు చేస్తుంది. దీనిపై ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వం, జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ సీఈలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే మంగళవారం ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కర్నూలు సీఈ కబీర్‌బాషా కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్‌రెడ్డి, ఎస్ఆర్‌బీసీ-1, తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఆర్‌బీసీ-2 సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి సహా ఆయా సర్కిల్స్ ఈఈలతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ, కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగుగంగ కాలువ, హంద్రీనీవా కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలు సహా వివిధ నీటి వనరులు, జలవనరుల శాఖ పరిధిలోని ఖాళీ స్థలాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏపీ కాలువలపై సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంది. కాలువ పక్కనే ఉన్న ఖాళీ స్థలాలు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఖాళీగా ఉన్న జలవనరుల శాఖకు చెందిన స్థలాలు, వాటి విస్తీర్ణం, కబ్జాకు గురైన స్థలాలు.. పూర్తి వివరాలు వివరాలతో నివేదిక ఇవ్వాలని సీఈ కబీర్‌బాషా ఎస్ఈలను ఆదేశించారు. బుధవారం సాయంత్రంలో నివేకలు ఇస్తే.. వాటి ఆధారంగా ఉమ్మడి జిల్లా నివేదిక తయారు చేసి గురువారం (20న) జరిగే స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ సమీక్షా సమావేశానికి హాజరయ్యేందుకు సీఈ సన్నాహాలు చేసుకుంటున్నారు. సాగునీటి కాలువలపై కెనాల్ టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తే.. వందలాది మెగావాట్స్ సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

కలెక్టర్‌ను కలసిన సీఈ కబీర్‌బాషా

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కర్నూలు సీఈ కబీర్‌బాషా మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిశారు. ఇటీవల కబీర్‌బాషా ఎస్ఈ నుంచి సీఈగా పదోన్నతి పొందారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశానని కబీర్‌బాషా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, సాగునీటి వనరుల నిర్వహణ, వేసవిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది.



దాహం తీర్చాలని హైవే రోడ్డుపై ఖాళీ బిందెలతో గ్రామస్థుల బైఠాయింపు

నీటి కోసం...!

మంత్రాలయంలో హైవేపై గ్రామస్థుల ధర్నా

మంత్రాలయం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'తాగేందుకు గుక్కెడు నీరివ్వండి మహాప్రభో..' అంటూ ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టిన ఘటన మంత్రాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఉదయం కల్లుదేవకుంట గ్రామస్థులు దాదాపు వందమందికి పైగా ఒక్కసారిగా ఖాళీబిందెలతో ఎమ్మిగనూరు - మంత్రాలయం హైవేపైకి వచ్చారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆందోళన చేపట్టారు. దాదాపు గంట సేపు ధర్నా చేయడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ ధర్నాను విరమించే ప్రసక్తే లేదని గ్రామస్థులు భీష్మించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, తహసీల్దార్ రవి, ఎస్ఐ శివాంజల్ ఎంత చెప్పినా వారు వినలేదు. చివరకు ఆదోని నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఏఈ వెంకట్రాముడు, ఎన్ఏపీ స్కీం కాంట్రాక్టరు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అక్కడకు చేరుకు నిరసనకారులతో మాట్లాడారు. నెల రోజులో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. రూ.20 లక్షలతో పైప్‌లైన్లు వేయించి కల్లుదేవకుంట, చిలకలడోన, చెట్నహల్లి గ్రామాలకు తాగునీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ తెలిపారు.



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని సూచనలు ఇస్తున్న పోలీసులు

ఏఎన్ఎం గ్రేడ్-3లకు పదోన్నతుల కౌన్సెలింగ్

173 మందికి హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న ఏఎన్ఎం గ్రేడ్-3లకు మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. 175 మంది ఏఎన్ఎంలకు గాను 172 మంది హెల్త్ అసిస్టెంట్లు (ఫిమేల్) పదోన్నతులు కల్పించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ, కర్నూలు నగర మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏవో కే.అరుణ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పదోన్నతుల ఆర్డర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఏఎన్ఎంలు 15 రోజుల్లో జాయినింగ్ రిపోర్టు అందజేయాలని, ఎక్కడైతే సచివాలయంలో పని చేస్తున్నారో అక్కడే పని చేయాలన్నారు. కౌన్సెలింగ్‌లో సీనియర్ అసిస్టెంట్లు మధుసూదన్, గిరి, అజయ్‌బాబు, మురళి బ్రహ్మం, లోకసాయి సిబ్బంది పాల్గొన్నారు.

హాస్పిటల్ నుంచి కౌన్సెలింగ్‌కు...



భర్త సహాయంతో బయటకు వస్తున్న ఏఎన్ఎం నాగమణి

కర్నూలు హాస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):15 ఏళ్ల సర్వీసు తర్వాత వస్తున్న పదోన్నతి కోసం జరిగే కౌన్సెలింగ్‌కు తీవ్ర అనారోగ్యాన్ని సైతం లెక్క చేయలేదు ఆ మహిళా ఉద్యోగి. మంగళవారం ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఎంపీహెచ్ఏ (ఎఫ్)లుగా పదోన్నతి కౌన్సిలింగ్ కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగింది. కోడుమూరు సచివాలయం-3 లో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3 నాగమణి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్ ఐసీయూలో చేరింది. కౌన్సెలింగ్‌కు మినహాయింపు ఇవ్వాలని ఏఎన్ఎం భర్త డీఎంహెచ్‌వోను కోరారు. వీడియో కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ 15 ఏళ్ల తర్వాత జరిగే పదోన్నతిలో నష్టపోవాల్సి వస్తుందని ఏఎన్ఎం అతికష్టం మీద హాస్పిటల్ నుంచి భర్త సాయంతో కౌన్సెలింగ్‌కు హాజరైంది. ఆమెకు ఏఎన్ఎంకు దేవనకొండ పీహెచ్‌సీ నేలతలమర్రి సబ్ సెంటర్‌కు పదోన్నతి పోస్టింగ్ ఇస్తూ డీఎంహెచ్‌వో ఆర్డర్స్‌ను అందజేశారు.

శనగ కొనుగోలు ప్రారంభం

- 15,848 మెట్రిక్ టన్నులకు అనుమతి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటం రూ.5,650 మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాకు 6,848 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 9,400 మెట్రిక్ టన్నుల శనగలను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు డీసీఎంఎస్‌లు, సొసైటీల ద్వారా వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించింది. మంగళవారం ఆలూరు మండలంలోని హత్తిబెళగల్ డీసీఎంఎస్ కేంద్రంలో రైతుల నుంచి శనగలను కొనుగోలు చేసే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నవ్యతో పాటు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు స్థానిక వ్యవసాయాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మార్క్‌ఫెడ్ డీఎం రాజు మాట్లాడుతూ శనగ రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

నాలుగు రోజులు బ్యాంకులు బంద్

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. 22న 4వ శనివారం కావడం, 23న ఆదివారం కాగా...24, 25 తేదీలలో బ్యాంకు సమ్మె జరగనుంది. రెండు రోజుల సమ్మెలో గ్రామీణ బ్యాంకులు, కో ఆపరేటివ్ బ్యాంకులతో సహా పబ్లిక్ సెక్టారు బ్యాంకులన్నీ సమ్మెలో పాల్గొననున్నాయి. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు వివిధ డిమాండ్‌లను పరిష్కరించుకునేందుకు రెండు రోజుల పాటు బ్యాంకులు బంద్ పాటిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

పాలిసెట్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కర్నూలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ మైనారిటీస్, జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఏ. చక్రవర్తి మంగళవారం తెలిపారు. పదో తరగతి, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు అన్నారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన వారు దరఖాస్తు రుసుం రూ.400, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వతేదీ చివరి గడువు అన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 7382264325, 9494834320 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తెలుగు రాష్ట్రాల ద్రోహులు కేసీఆర్, జగన్

- చంద్రబాబునాయుడులాంటి నాయకుడు తెలంగాణాకు కూడా అవసరమేమో..!
- టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న బైరెడ్డి

నందికొట్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి రెండు తెలుగు రాష్ట్రాల ద్రోహులుగా గురుశిష్యులైన మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్ నిలిచారని టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు మంగళవారం నందికొట్కూరు నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు నాశనం కావడానికి మాజీ ముఖ్యమంత్రులు ఇద్దరే కారణమని ఆయన అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలు నలిగిపోతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలను ఆర్థికాభివృద్ధిలో పాతాళానికి జగన్, కేసీఆర్‌లు తొక్కి వెళ్లారన్నారు. ఇద్దరు గురుశిష్యులు కలిసి మాట్లాడుకొని రెండు తెలుగు రాష్ట్రలను సర్వనాశనం చేశారన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు మల్లన్న ప్రసాదం



క్యాలెండర్ ఇస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అసెంబ్లీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదం, శేషవస్త్రం, పాగాలంకరణ వస్త్రం, రుద్రాక్షలు, కంకణాలు అందజేశారు. ఈయన వెంట టీడీపీ నాయకుడు యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు, టోల్‌ఫ్రీ నెంబర్ వివరాలతో శాశ్వతంగా ఉండేలా స్కూళ్లు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా డీఈవోను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల సరఫరా వినియోగాన్ని పూర్తిగా అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞల ద్వారా విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

యువతి, బాలిక అదృశ్యం.. ఇద్దరిపై కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓ యువతి(19), మరో బాలిక(13) అదృశ్యం అయినట్లు మంత్రాలయం హెడ్‌కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 17వ తేదీ రాత్రి ఓ యువతి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. అదే గ్రామానికి చెందిన మరో బాలిక పత్తికొండ బాలికల హాస్టల్‌లో చదువుకుంటూ బంధువుల పెళ్లికి స్వగ్రామానికి వచ్చింది. ఈనెల 17న తండ్రి హాస్టల్‌లో వదిలిపెట్టి వచ్చాడు. సాయంత్రం నుంచి బాలిక కనిపించడం లేదు. ఈ ఇద్దరి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలికి వచ్చి మహిళ గల్లంతు

హాలహర్వి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చరపల్లి గ్రామం వద్ద శ్రీదేవి (38) అనే మహిళ ఎల్ఎల్‌సీలో దాహం తీర్చుకోవడానికి వెళ్లి గల్లంతయిందని ఎస్సై చంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీదేవి ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఆమె పచ్చరపల్లి మిరప కోతలు కోసం కూలి పనులకు వచ్చిందని దప్పిక కావడంతో దాహం తీర్చుకోవడానికి కాలువ వద్దకు వెళ్లి నీరు తాగుతుండగా కాలుజారి నీటిలో పడిపోయిందని తెలిపారు. శవం ఆచూకీ కోసం కాలువపై గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వైసీపీ భక్త ఎస్ఐపై వేటు

- ఆస్పరి ఎస్ఐ వెంకట నరసింహులు సస్పెండ్
- చిత్తూరు జిల్లాలో చేసిన అరాచకాలు వెలుగులోకి..
- అధికార అండదండలతో చిత్తూరు నుంచి కర్నూలుకు
- జిల్లా దాటి వెళ్లకూడదంటూ ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)



సస్పెన్షన్ ఉత్తర్వుల్లో వివరాలు...

- సెప్టెంబరు 2023లో భార్యాభర్తలు గొడవపడి చిత్తూరు జిల్లా సోమల స్టేషన్‌కు వచ్చారు. అప్పటి ఎస్ఐ నరసింహులు సదరు మహిళ నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. ఆ మహిళ డబ్బులు లేవని చెప్పడంతో కానిస్టేబుల్ ద్వారా పాన్ బ్రోకర్‌ని స్టేషన్‌కు పిలిచారు. ఆమె తాళిబొట్టును తాకట్టు పెట్టి రూ.60వేలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో ఉంది. దాన్ని వడ్డీతో సహా చెల్లించి బంగారు తాళిబొట్టును తీసుకున్నట్లు విచారణలో తేలింది.
- అదే ఏడాది అదే స్టేషన్‌లో తన పొలంలోని రూ. మూడు లక్షల విలువ చేసే టమోటా పంట కోసం ఉంచిన వెదురు కర్రలు దొంగిలించారని ఓ వ్యక్తిపై బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. వ్యక్తిపై కేసు నమోదు చేసి కేసు కోసం రాజీ చేస్తానని ఇరువర్గాల నుంచి రూ. 30వేలు నగదు తీసుకున్నట్లు తేలింది.
- 2023లో సోమలలో 213 ఎఫ్ఐఆర్ నెంబరుతో నమోదైన కేసులో యువరాజానాయుడిని స్టేషనుకు పిలిచి అత్యంత దారుణంగా తిట్టడంతోపాటు తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించిన వీడియో వైరల్ అయింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వ హయాం కావడంతో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- 2023 డిసెంబరులో సోమల మండలం కమ్మపల్లెలో సంఘమిత్ర తొలగింపు విషయంగా ఘర్షణలు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే మహిళలను వైసీపీ వర్గీయులు కొట్టారు. మగాళ్ల దుస్తులు చించేసి మరీ దాడి చేశారు. స్థానికులు వీడియోలు తీస్తుంటే ఎస్ఐ లాక్కున్నారు. టీడీపీ మద్దతుదారులపై హత్యాయత్నం కేసులు పెట్టిన ఎస్ఐ, వైసీపీ వారిపై నామమాత్రంగా బెయిలబుల్ కేసులు పెట్టారు. టీడీపీ వాళ్ల ఫిర్యాదుల్ని పట్టించుకోలేదు.
- ఓ గ్రామంలో వైసీపీ నేత వద్ద రూ.లక్ష లంచం తీసుకుని వారం రోజుల్లో ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లే ఓ యువకుడి మీద అక్రమ కేసు పెట్టి పైశాచిక ఆనందం పొందినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.
- చెన్నైలో స్థిరపడిన ఓ డాక్టర్‌కు అతని బంధువుల మధ్య ఏర్పడిన భూసమస్యను పరిష్కరిస్తానని రూ.లక్ష లంచం తీసుకుని పట్టించుకోలేదని తెలుస్తోంది.
- పెద్దిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు ఓ సందర్భంలో బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌పై తన స్టేషన్‌లోనే నోరు పారేసుకున్న విషయం తెలిసిందే.



ఎస్సై దాష్టీకాలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాలు

ఇద్దరు కూలీల మృతి

- మహానందిలో వసతి గృహం కూల్చివేత పనుల్లో విషాదం




కూలిన వసతి గృహం పైకప్పు... రాముడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మహానంది, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మంగళవారం సాయంత్రం వసతి గృహం కూల్చివేత పనులకు వచ్చిన ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు. వీరు కందికాయపల్లెకు చెందిన రాముడు(65), వెంకటేశ్వర్లు(50) ఆలయం అభివృద్ధిలో భాగంగా భక్తుల వసతి కోసం రూ. 10 కోట్లతో నిర్మిస్తున్న నూతన వసతి గృహం నిర్మాణ పనులకు గతంలో నిర్మించిన నాగనంది సదనం వసతి గృహం కొంత భాగం అడ్డంకిగా మారింది. దీని కోసం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ అనుమతితో రూ.4.20 లక్షలకు టెండర్ ప్రక్రియను కూల్చివేత పనులను కర్నూలుకు చెందిన కాంట్రాక్టర్ నారాయణరెడ్డికి అప్పగించారు. ఇందులో భాగంగానే 10 రోజుల నుండి వసతి గృహం కొంత భాగాన్ని కాంట్రాక్టర్ రెండు ఎక్స్‌కవేటర్లతో పనులను ప్రారంభించాడు. నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన కొంత మంది కూలీలు ప్రతి రోజు కూల్చివేత పనులకు వస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో పనులు జరుగుతుండగా ఇద్దరు కూలీలు రాముడు, వెంకటేశ్వర్లు సమీపంలోని వసతి గృహం పై భాగంలో కూర్చొని పిచ్చిపాటి మాట్లాడుకుంటూ ఉండగా ఎక్స్‌కవేటర్ తాకిడికి ఉన్న పళంగా అది కూలి పోయింది.

ఈ ప్రమాదంలో రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లును దేవస్థానానికి చెందిన బొలేరో వాహనంలో చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. రాముడుకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మరో మృతుడు వెంకటేశ్వర్లుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఇటీవల మృతి చెందింది. ఈ సంఘటనపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటా మన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

నవ వరుడి అనుమానాస్పద మృతి



గొంట్ల వెంకటేష్ (ఫైల్)

నంద్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం ఎంఎస్ నగర్‌కు చెందిన నవ వరుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం కలకలం రేపింది. మృతుడు గొంట్ల వెంకటేష్ (26) శుభకార్యాలకు క్యాటరింగ్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. 3నెలల క్రితం ఓ యువతితో వివాహం జరిగింది. అయితే ఎంఎస్ నగర్‌లో తాను క్యాటరింగ్ చేసే గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో స్థానికులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులతో ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు.

బైకులు ఢీ.. ఒకరి మృతి



హనుమన్న (ఫైల్)

పత్తికొండ, మార్చి18 (ఆంధ్రజ్యోతి): బైకులు ఢీని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివారలు.. పత్తికొండ వడ్డేవారికట్ట సమీపంలో నివసించే హనుమన్న(60) పట్టణంలోని మార్కెట్ వద్ద కోయనగర్‌వద్ద హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ చేశాక ఇంటికి వెళ్లేందుకు బైక్‌ను అకస్మాత్తుగా వెనుకకు తిప్పాడు. అదేసమయంలో పత్తికొండ నుంచి తుగ్గలికి వెళుతున్న పట్టణానికి చెందిన అబిరామ్ బైక్ వేగంగా ఢీ కొంది. ఈప్రమాదంలో హనుమన్న తలకు తీవ్ర గాయాలు కాగా అబిరామ్‌కు గాయాలయ్యాయి. వీరిని పత్తికొండ ఆసుపత్రికి తరలించగా హనుమన్న మృతిచెందాడు. కాగా అబిరామ్ తలకు గాయాలు కావడంతో వైద్యులు మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



ముద్దాయితో సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత శనివారం హత్యకు గురైన మహిళ నజీమూన్ కేసులో నిందితులు భర్త అబ్దుల్లా, అత్త రఫియాబీలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నజీమూన్ హత్యకు వినియోగించిన కర్ర, కూరగాయలు తరిగే కత్తిపీటను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టణంలోని ఎస్.ఎస్.ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఇంట్లోనే వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

నంద్యాల హస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ రాజకుమారి తనిఖీ చేశారు. కలెక్టర్ క్యూఆర్‌కోడ్ స్కాన్‌చేసి ఆహార పదార్థాలు ఇస్తున్నారా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు.

11 మంది ఎస్ఐలు బదిలీ

కర్నూలు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 11 మంది ఎస్ఐల బదిలీపై డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.హనుమంత రెడ్డి	వీఆర్, ఎస్‌పీ, కర్నూలు	కోసిగి పీఎస్
ఎస్.బాల నరసింహులు	హొళగుంద, పీఎస్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్
జి. చంద్రమోహన్	కోసిగి పీఎస్	కర్నూలు త్రీటౌన్ యుపీఎస్
ఎం.కేశవ	కొత్తపల్లి పీఎస్ (నంద్యాల)	నందవరం పీఎస్
వి. శ్రీనివాసులు	నందవరం పీఎస్	డీసీఆర్‌బీ, కర్నూలు
ఏ. రమేష్‌బాబు	వీఆర్ ఎస్‌పీ, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్, పీఎస్
జే.మన్మథ విజయ్	కర్నూలు టూటౌన్ యుపీఎస్	వీఆర్ కర్నూలు అటాచ్ ఆస్పరి యూపీఎస్
ఎన్‌సీ మల్లికార్జున	డీఎస్‌బీ, కర్నూలు	జొన్నగిరి పీఎస్
ఆర్. జయశేఖర	జొన్నగిరి పీఎస్	ఆదోని త్రీటౌన్ యుపీఎస్
షేక్ మహబూబ్ బాషా	హొళగుంద పీఎస్ యూపీఎస్, ప్రస్తుతం డీఎస్‌బీ, కర్నూలు	ఆలూరు పీఎస్
జి. దిలీఫ్ కుమార్	ఆలూరు పీఎస్	హొళగుంద పీఎస్

బీసీలకు వరం ఆదరణ పథకం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకం బీసీలకు వరమని కురుబ కార్పొరేషన్ చైర్మన్ ఎం.దేవేంద్రప్ప, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ జాకీర్ హుసేన్ అన్నారు. మంగళవారం నగరంలోని సంక్షేమ భవన్‌లో ఉన్న బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదరణ పథకం-3 కులవృత్తుల పరికరాలపై ఏడీ జాకీర్ హుశేన్ అధ్యక్షతన బీసీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో బీసీ కులవృత్తుల వారికి ఆదరణ పథకం-3 ద్వారా విలువైన పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కురువ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణ, బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, బీసీ జాతీయ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ సంఘం నాయకులు ధనుంజయాచారి, బీసీ కులాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గ క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్




ఆలయ అభివృద్ధి మ్యాప్‌ను పరిశీలిస్తున్న సభ్యులు, అధికారులు

ఓర్వకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయాన్ని మల్లెల రాజశేఖర్‌తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈ లక్ష్మీపతి, డీఈ శ్రీనివాస్ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విద్యాసాగర్, ఈవో మద్దిలేటి, కాల్వబుగ్గ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. వారికి ఈవో మద్దిలేటి, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని చిన్న, పెద్ద కోనేరులను, పరిసరాలను పరిశీలించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావుకు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ రూ.14 కోట్ల పనులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికను బోర్డు సభ్యులకు ఇచ్చారు. ఇటీవలె కాల్వబుగ్గ దేవస్థానానికి రూ.14 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా నివేదికలు ఇచ్చామని అన్నారు. కాల్వబుగ్గలో రూ.14 కోట్లలతో స్టోన్ ఫ్లోరింగ్, పశ్చిమాన 5 అంతస్థుల రాజగోపురం పునఃనిర్మాణం, మూడంతస్థుల రాజగోపురాల నిర్మాణం, ఆలయ ప్రదేశం చుట్టూ ప్రహరిగోడ నిర్మాణం పనులను చేపట్టేందుకు నివేదికలు ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, కేవీ మధు, అబ్బీ, బజారు పాల్గొన్నారు.

పైసా వసూల్ ..!

- ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు
- చేయి తడపనిదే సాగని పనులు
- సచివాలయ, తహసీల్దార్ల కార్యాలయాలపై పర్యవేక్షణ కరువు
- కుల, ఆదాయ, మ్యుటేషన్, నాలా తదితరాల సర్టిఫికెట్లకు వసూళ్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



కర్నూలు కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయాల్లో వసూల్ రాజాలు రాజ్యమేలుతున్నారు. మండల స్థాయిలోని అటెండరు దగ్గర నుంచి జిల్లా కేంద్రంలో ఉన్న ఉన్నతాధికారుల వద్ద పని చేసే క్యాంప్ క్లర్క్ వరకు అందరిపైనా అవినీతి ఆరోపణలే. మరీ ముఖ్యంగా రెవెన్యూ శాఖలో కూడా వసూళ్ల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న విమర్శలు ఉన్నాయి. అలాగే గ్రామ సచివాలయ ఉద్యోగుల అవినీతి ఎక్కువగా సాగుతున్నట్టు తెలుస్తోంది. కింది నుంచి పై దాకా చేతులు చాపే వ్యవహారం నడుస్తుండడం తో బాధితులు లంచాలు ఇవ్వలేక అల్లాడిపో తున్నారు.

● **గ్రామ, వార్డు సచివాలయాల్లో అవినీతి దందా :** ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు తము వేసిన పంట నమోదు కోసం గ్రామ వ్యవసాయాధికారిని సంప్రదిస్తున్నారు. పంట నమోదు చేయాలంటే కనీసం రూ.500 నుంచి రూ.1000 లేనిదే నమోదు చేయలేమని గ్రామ వ్యవసాయాధికారులు బహిరంగంగా చెబుతున్నారు. కనీసం పెట్రోల్, డీజిల్ ఖర్చు బరాయించాల్సిందే అని రైతులపై వేధింపు లకు గురి చేస్తున్నారు. గ్రామాల్లోని తమకు అనుకూలమైన వారికి ప్రభుత్వం అత్యధిక పంట నష్టపరిహారం ఇచ్చే పంటను నమోదు చేస్తు న్నారు. అలా చేసి తమ అనుకూలమైన రైతులను ఏకం చేసుకొని మిగతా రైతుల దగ్గర డబ్బులను వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ముట్టజెప్పని రైతులను అనేక వేధింపులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల పేదరిక నిర్మూలన కోసం అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామ స్థాయి నుంచి పట్టణం వరకు లబ్ధిదారులు గృహ నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణం అను మతులు పొందాలంటే లబ్ధిదారులు అధికా రుల చేతులు తడపాల్సిందే. టీడీపీ అధికారం లోకి రావడంతో నూతన రేషన్‌కార్డులు, నూ తన పెన్షన్ల మంజూరు కోసం అనేక మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. నూతన పెన్షన్ల మంజూరు, రేషన్ కార్డులో కొత్త వారిని నమోదు చేయడం, చనిపోయిన వారిని తొలగించడం వంటి మార్పులు, చేర్పు లకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం.

● **ఒకే మండలంలో తిష్ట వేసిన వీఆర్వోలు:** కొంత మంది వీఆర్వోలు జిల్లాలో పది సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వరకు ఒకే మండలంలో తిష్ట వేశారు. క్రిష్ణగిరి, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో ప్రభుత్వం మారినా అక్కడే కొనసాగుతున్నారు. దీంతో వారు తహసీల్దార్లను శాసించే స్థాయికి ఎదిగారన్న విమర్శలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇనామ్ భూములు, అసలు భూములు, ఫ్రీహోల్డ్ విషయం లో అనేక మంది వీఆర్వోల తప్పిదాల వల్ల రైతులు బలయ్యారు. గ్రామ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నాలా మరణ ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం వెరిఫికేషన్ చేయాలంటే కూడా ముడుపులు చెల్లించుకునే పరిస్థితి నెలకొంది. జిల్లాలో కొంత మంది తహసీల్దార్లు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతి రేకంగా పని చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

● **ఉద్యోగుల చేతివాటం:** కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో సెక్షన్‌లో పని చేసే కొంత మంది ఉద్యోగులు, బదిలీలు డిప్యుటేషన్ల, పదోన్నతుల కోసం కింది స్థాయి ఉద్యోగుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో వీఆర్వో గ్రేడ్-1 పోస్టులు దాదాపు 70 ఖాళీ ఉన్నాయి. నగరానికి చెందిన సచివాలయ ఓ వీఆర్వో గ్రేడ్-1 పోస్టులు, పదోన్నతుల ప్రక్రియ మొదలైందని ఒక్కో వీఆర్వో నుంచి రూ.5 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. డీఆర్వో కార్యాలయంలో ఏ-సెక్షన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు, డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సూపరింటెండెంట్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. జిల్లా భూసర్వే రికార్డు కార్యాలయంలో మరో ఉద్యోగి ఇంక్రిమెంటు పెంచేందుకు ఒక్కొక్క గ్రామ సర్వే దగ్గర 500 నుంచి రూ.2000, రూ.650 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ గ్రామ సర్వేయర్ల ప్రొహిబిషన్ డిక్లరేషన్ నుంచి చివరకు టీఏ బిల్లుల వరకు వారి దగ్గర నుంచి వసూళ్ల పర్వం కొనసాగుతోంది. రెండు నెలలకోసారి ఏదో ఒక రూపంలో సర్వీసు రిజిస్టర్‌లో ఎంట్రీ అని, లీవ్ శాంక్షన్ అని, ట్రాన్స్‌పోర్ట్ అని ఏదో ఒక రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు గ్రామ సర్వేలు ఆరోపిస్తున్నారు.

క్రిష్ణగిరి తహసీల్దార్‌ను విధుల నుంచి తొలగించాలి



క్రిష్ణగిరి మండలం మాదాపురం గ్రామంలో మాదిగలకు ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సర్వే నెం.759/ఏ1/700/1 విస్తీర్ణంలో 43 ఎకరాల 23 సెంట్లు కేటాయించింది. ఈ భూములను ఉన్నత కులాల వారు రెవెన్యూ అధికారుల సహకారంతో అడంగల్, 1బీ నమోదు చేయించుకొని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అక్రమంగా నమోదు చేసిన 1బీ అడంగల్‌ను రద్దు చేసి బాధితుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆర్డీవో క్రిష్ణగిరి మండలం తహసీల్దార్‌కు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదు. క్రిష్ణగిరి మండల తహసీల్దార్ చంద్రశేఖర్‌పై విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. - బొందిమాడుగుల టి.ఎం.రమేష్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదు



గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలోని 766, 767, 768 సర్వే నెంబరులో ఉన్న నా మూడు ఎకరాల పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతున్నా పరిష్కరించడం లేదు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. రెండు సంవత్సరాల నుంచి ఇవాళ రేపు అని చెబుతున్నారు. మూడెకరాల పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని అధికారులు కోరుతున్నాను.

- ఉప్పరి నారాయణ, చనుగొండ్ల గ్రామం

అధికారులపై చర్యలు తీసుకుంటాం



పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్స్, డిప్యుటేషన్ అని అధికారులు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరిని కూడా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది ఉండదు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. - వెంకటనారాయణమ్మ, డీఆర్వో

పన్నులు చెల్లించకపోతే దుకాణాలు సీజ్



శ్రీచక్ర ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగర పాలకకు సంబంధించి ఆస్తి, కొళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్సు రుసుములను త్వరగా చెల్లించకపోతే వాణిజ్య సముదాయాల దుకాణాలను సీజ్ చేస్తామని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ హెచ్చరించారు. చెన్నమ్మ కూడలిలో సమీపంలోని శ్రీచక్ర హస్పిటల్ కార్పోరేషన్‌కు రూ.6.58 లక్షల ఆస్తి పన్ను బకాయిలు చెల్లించడంలో అలసత్వం వహిం చడంతో మంగళవారం రెవెన్యూ సిబ్బంది ఆసుపత్రి ఎదుట బ్యానర్లు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ బకాయిదారులు త్వరగా పన్నులు చెల్లించకుంటే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా దుకాణాలన సీజ్ చేస్తామన్నారు. ఇళ్లకు తాగునీటి కొళాయి కనెక్షన్లు తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ జునైద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ జీఎం.శ్రీకాంత్, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

నిలిచిన రోడ్డు పనులను ప్రారంభించాలి

కర్నూలు రూరల్ మార్చి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం గార్గేయపురం నుంచి కేతవరం-పూడిచెర్ల మెట్టవరకు నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గార్గేయపురం-కేతవరం ప్రధాన రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేతవరం నుంచి గార్గేయపురం వరకు రోడ్డు మోకాలి లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ప్రధాన రహదారి అటు కర్నూలు, నంద్యాల ఇటు విజయవాడ హైవే దగ్గరల్లో ఉన్నందున నిత్యం అనేక మంది వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుంటారని వివరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగన్న, నాయకులు రంగస్వామి, నాగమ్మ, మద్దిలేటి, సుబ్బరాయుడు, రవి పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి నిప్పు

కోడుమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణం సమీపంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాంస విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. విగ్రహం తలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. ఈ సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. దీంతో వైసీపీ నాయకులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసు లు వెంటనే వైఎస్ఆర్ విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు మాట్లాడుతూ పోలీసులు సమగ్ర విచారణ చేసి దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు లాయర్ ప్రభాకర్, క్రిష్టారెడ్డి, సుబ్బారావు, గోపి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి



ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అశోక్‌నగర్ ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యాకోబు మాట్లాడుతూ పెన్షనర్లకు రైల్వేలో రాయితీ, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకరప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, నాయ కులు మద్దిలేటి, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు, ఆనందరావు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టళ్లను పునఃప్రారంభించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలో బీసీ బాలుర హాస్టళ్లను పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కోడుమూరులో బీసీ బాలుర వసతి గృహం లేక పోవడం బాధకరమన్నారు. అలాగే కళాశాల మేనేజ్మెంట్ హాస్టల్‌కు సొంత భవనం లేక వర్కూరు గ్రామ సమీపంలోని అద్దె భవనంలో నడుపుతు న్నారని చెప్పారు. కాబట్టి వసతి గృహాలకు స్థలం కేటాయించి, భవంతులు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఏపీ మోడల్ స్కూల్ రహదారి పూర్తిగా గుంతలమయమైందని, మోడల్ స్కూల్‌కు తక్షణమే రోడ్డును వేయాలని కోరారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కోడుమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రంగస్వామి, మునిస్వామి, సిద్దు, కిషోర్, తరుణ్ సాయి, మల్లి పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్లపై అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఎస్‌వో కార్యాలయంలోని సూపరింటెండెంట్ శివరంజనికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్యాస్ ఏజెన్సీల గ్యాస్ డెలివరి బాయ్‌లు వినియోగదారుల నుంచి రూ.50 నుంచి 150 అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లను నియంత్రించాలని కోరారు.

నో హెల్మెట్- నో ఎంట్రీ బ్యానర్‌ను ఏర్పాటు చేయండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కలెక్టరేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ కార్యాల యాల పరిసరాల్లో తప్పనిసరిగా హెల్మెట్ వాడేలా నో హెల్మెట్- నో ఎంట్రీ అనే బ్యానర్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపాడు నుంచి హైదరాబాదు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించి ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ మున్సిపల్ శాఖల అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి నివేదిక అందజేయాలన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఫ్రీలెఫ్ట్‌కు సంబంధించి, బస్టాండు నుంచి బెంగళూరు రోడ్డుకు వెళ్లే వాహనాల కోసం ఫ్రీలెఫ్ట్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయట ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు ఫ్రీలెఫ్ట్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనాలను త్వరగా సమర్పించాలన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు హెల్మెట్‌ను ఉపయో గించేలా అవగాహన కల్పించడంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్రోల్ షాపుల్లో నోహెల్మెట్- నో ఎంట్రీ అని బ్యానర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



ముస్లింలకు ఇఫ్తార్ ఇస్తున్న చంద్రగోవర్ధనమ్మ, చంద్ర పెద్ద స్వామి

ఓర్వకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు మంగళవారం గ్రామ సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, టీడీపీ నాయకులు కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్ద స్వామి ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఇచ్చారు. అంతకుముందు మసీదులో ప్రార్థనలు చేసి ముస్లింలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

రోగిని తోసేసిన ఉద్యోగి!

కర్నూలు హాస్పిటల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో ఓ అత్యవసర రోగిపై ఓ ఉద్యోగి దురుసుగా ప్రవర్తించారు. రోగి గొంతును పట్టుకుని ఆ ఉద్యోగి తోసేసారు. మంగళవారం ఓ రోగి అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం డయో గ్నస్టిక్ బ్లాక్‌కు వచ్చారు. టోకెన్ లేదని సెక్యూరిటీ గార్డు చెప్పగా కొద్దిసే పు ఆగాలని చెప్పారు. గంటల తరబడి తాము వేచి చూస్తున్నామని రోగి చెప్పారు. అంతలో ఓ ఉద్యోగి వచ్చి రోగిని తోసేయడంతో బంధువులు తిరగబడ్డారు. పరిస్థితి విషమించడంతో పీజీ వైద్య విద్యార్థి వచ్చి స్కా నింగ్ చేస్తామని చెప్పడంతో పరిస్థితి సర్దుమణిగింది. రోగిపై దురుసుగా ప్రవర్తించిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని బంధువులు కోరారు.

పన్ను వసూళ్లకు అదనపు కౌంటర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలో ఆస్తి, కొళాయి పన్నుల వసూళ్లకు అధికారులు మంగళవారం అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. మేనేజర్ చిన్నరా ముడు కౌంటర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపు దారులు నిరీక్షించకుండా త్వరగా పన్నులు చెల్లించేందుకు వీలుగా అదనపు కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

మాంటిస్సోరి విద్యార్థుల ర్యాలీ

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 2004 జూన్ 5న అంతరిక్షంలోకి వెళ్లి కొన్ని సాంకేతిక కారణాలతో భూమిపైకి తిరిగి రాలేక.. అక్కడే చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీత విలియమ్స్, బుచ్ విల్ మోర్ 9 నెలల ప్రయత్నాలు ఫలించి బుధవారం భూమిపైకి తిరిగి రానున్న సందర్భంగా మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు కలెక్టర్ కార్యాలయం వరకు మంగళ వారం ర్యాలీ నిర్వహించారు. వ్యోమగా ములకు చిన్నారులు శుభా కాంక్షలు తెలియజేశారు.

కొనసాగుతున్న తనిఖీలు

కర్నూలు క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎస్ఐ గోపినాథ్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ బృందాలు తనిఖీలు చేశారు. పార్కులు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అనవసరంగా తిరుగుతున్న వారిపై లాఠీ ఝుళిపించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేసి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో మంత్రి టీజీ భరత్ విజయం



బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఏపీ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2025 ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఇండోర్ స్టేడియంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే పత్తి పాటి పుల్లారావుతో కలిసి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, పితాని సత్యనారాయణ టీంతో షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. డబుల్స్ బ్యాడ్మింటన్ ఆసక్తికరంగా సాగింది. చివరకు 15-10 పాయింట్లతో మంత్రి టీజీ భరత్, పత్తిపాటి పుల్లారావు టీమ్ విజయం సాధించింది. అనంతరం సింగిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజుతో కలిసి మంత్రి టీజీ భరత్ బ్యాడ్మింటన్ ఆడారు. 21-10 తేడాతో ఆర్ఆర్ఆర్‌పై మంత్రి టీజీ భరత్ విజయం సాధించారు.

అన్న క్యాంటీన్‌లో తనిఖీలు

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, పాతబస్తీలోని అన్న క్యాంటీన్లను కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఆహార నాణ్యతపై ఆయన ప్రజలను ఆరా తీశారు. అల్పాహారం చేయడానికి వచ్చిన ప్రజలను కమిషనర్ ఆప్యాయయంగా పలకరించి, రుచిని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ల వద్ద భోజన సమయం కన్నా ముందే స్వచ్ఛత పనులు చేపట్టాలని, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడొద్దని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

పండ్లతోటల పరిశీలన

సి.బెళగల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని పండ్లతోటలను కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటల పెంపకంతో అధిక లాభాలు సాధించవచ్చునని అన్నారు. ఆయన వెంట ఎంపీఈవోలు చెంచు రాజు, భాస్కర్, రైతులు ఉన్నారు.

రీసర్వే ..

సి.బెళగల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో జరుగుతున్న రీసర్వేను కర్నూలు ఏడీ మునికన్నన్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే చేస్తున్నట్లు రెవెన్యూ సిబ్బంది రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట జిల్లా రీసర్వే ఏడీలు సుబ్బారెడ్డి, విజయ కుమారి, మండల సర్వేయర్ నాగభూషణం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు వీఆర్వోలు ఉన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

సి.బెళగల్, 18 మార్చి (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఉన్న వ్యవసాయ అసిస్టెంట్లను రైతులు సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో లేబర్ కోడ్‌లను ప్రవేశపెడితే కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి బడేసాహెబ్, సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు, కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.

● శిథిలమైన రోడ్లపై సిమెంటు రోడ్డు వేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. సీపీఎం అధ్వర్యంలో 23వ వార్డు శ్రీరామ్‌నగర్, 14,15,16 వార్డులలో సీపీఎం అధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ మేరకు వార్డులలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరసింహులు, రాజశేఖర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. కాలనీలలో శిథిలమైన రోడ్లను యుద్ధప్రాతిపదికన నిర్మించాలన్నారు. రాముడు, ఆర్.చంద్ర, సుధాకర్, అజ్మత్, వై.జాన్సన్ పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ అన్నారు. మంగళవారం జిల్లా మీడియా పాయింటులో ఉచిత వైద్య శిబిరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని అన్నారు. ఈనెల 20న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరా నికి జర్నలిస్టులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫొటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మీసాల రామస్వామి, శ్రీనివాసులు, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

వాల్మీకులను షెడ్యూల్ తెగల్లో చేర్చాలి

కర్నూలు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను షెడ్యూల్ తెగల్లో చేర్చాలని ఆ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కోరారు. మంగళవారం సీఎం చంద్రబాబును వాల్మీకి సామా జిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం వినతిపత్రం సమర్పించారు. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కేంద్రానికి త్వరగా సానుకూల నివేదిక అందించాలని ప్రభుత్వ చీఫ్ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, డాక్టర్ పార్థసారథిలు కోరారు.

భూగర్భ జలాలను పెంచుకోవాలి

సి.బెళగల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంచుకోవా లని మండల గణాంక అధికారి ఆదినారాయణ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాల్టా చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని వీఆర్వోలను ఆదేశించారు. రైతులు విచ్చలవిడిగా బోరులను తవ్వడం వలన భుగర్భజలాలు అడుగంటి పోతున్నాయన్నారు. ఈసమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముంచిన పంటలు

- వేరుశనగకు తెగులు, మిరపకు నల్లి
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన



దేవనకొండకు చెందిన ఈ రైతు పేరు బుదారపు అంజి. రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ సాగుచేశాడు. కౌలుకు రూ.50 వేలు, వేరుశనగ సాగుకు రూ.80 వేల పెట్టుబడి పెట్టాడు. అయితే తెగులు ప్రభావంతో దిగుబడి రాలేదు. రూ.40 వేలు కూడా వచ్చే అవకాశం లేదు. తనకు అప్పుల భారం మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

దేవనకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలు నిలువునా ముంచాయి. వేరుశనగ 4 వేల ఎకరాల్లో సాగుచేయగా, మిరప 3 వేల ఎకరాలలో సాగైంది. సీజన్ ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించక పంటలు పాడయ్యాయి.

వేరుశనగకు ఎర్రనల్లి..

పంటకు ఎర్ర తెగులు సోకడంతో పంట ఎదగలేదు. దీంతో కాయ పట్టే దశలో మొక్క గుల్లబారుతోంది. తెగులు ప్రభావంతో పంట దెబ్బతినడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

మిరప ధర పతనం



6.5 ఎకరాల్లో మిరప సాగుచేశా. అయితే ఎర్ర నల్లి ప్రభావంతో పంట దెబ్బతింది. దిగుబడి ఆశించినంతగా రాలేదు. వచ్చిన పంటకు ధర కూడా లేదు. - **హర్షవర్ధన్ రెడ్డి, పాలకుర్తి, దేవనకొండ మండలం**

పెట్టుబడి కూడా రాలేదు..

ఎకరాకు వేరశనగ సాగుకు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. అయితే రూ.20వేలు మాత్రమే రావడంతో పెట్టుబడి కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరపను ముంచిన నల్లి, ఆకుముడత

వాతావరణ ప్రభావంతో మిరపకు ఎర్రనల్లి, ఆకుముడత సోకింది. దీంతో దిగుబడి ఆశించిన మేర రాలేదు. సాధారణంగాఎకరాకు 40 క్వింటాళ్లు రావలసి ఉండగా, 20 క్వింటాళ్లలోపే రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలలు ప్రమాణాలు పాటించడం లేదు

అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు ప్రమాణాలు పాటించడం లేదని, ఎలా వారికి అనుమతులు మంజూరు చేశారని ఎమ్మెల్యే పార్థసారథి ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయంపై ప్రశ్నలను లేవనెత్తారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రచార ఆర్భాటాలకు తల్లిదండ్రులు ఆకర్షితులై మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి తమ పిల్లలను చదివిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుకు గదులు, గాలి, వెలుతురు, ఆటస్థలం కూడా ఉండవన్నారు. ఫీజుల వివరాలను ప్రదర్శించడం లేదన్నారు. పుస్తకాలు, స్పెషల్ ఫీజులు, ల్యాబ్ ఫీజులంటూ వేలకు వేలు తల్లిదండ్రులు నుంచి దోచుకుంటున్నారని ఆరోపించారు. కర్నూలు జిల్లాలో 50శాతం స్కూళ్లకు అగ్నిమాపక శాఖ రెన్యువల్ లేవన్నారు. మంత్రి లోకేష్ సమాధానం ఇస్తూ 2008 జూలై 7వ తేదీన జీవో నెంబర్ 88 ప్రకారంగా మున్సిపాలిటీ, పంచాయతీల నిబంధన ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఆట స్థలం, ఇండోర్ స్పోర్ట్స్ హాలు కూడా ఉండాలని అలా కాని పక్షంలో మరో పాఠశాలతో అటాచ్ అవ్వచ్చన్నారు. జీవో 88కు సవరణలు చేసి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని సమాధానమిచ్చారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

హాలహర్వి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని బాపురం, చింతగుంట, విరుపాపురం తాగునీటి పథకాల ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామన్నారు.

22న మార్కెట్ వేలాలు

ఆదోని టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ వేలాలను ఈనెల 22న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం తెలిపారు. 2025 ఏప్రియల్ నుంచి 2026మార్చి 30న తేదీ వరకు రుసుము వసూలు చేసుకొనే నిమిత్తం బహిరంగ వేలాలు వేస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు మున్సిపల్ కార్యాలయంలో అదేరోజు ఉదయం 11గంటలకు పాల్గొనాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం రద్దు చేయాలని మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరాం డిమాండ్ చేశారు. మంగళవారం వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏక సభ్య కమిషన్ 2011 జనాభా లెక్కల ప్రకారం నివేదిక ఇవ్వడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలపై పక్షపాత ధోరణితో వ్యవహరించారని ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న వర్గీకరణను అమలు చేయకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహానంది, నాయకులు చంద్రశేఖర్, వెంకటరాముడు, వీరన్న, భరత్, బసాపురం వీరన్న, లింగప్ప పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



రవి నాయక్ (ఫైల్)

తుగ్గలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువు తండాకు చెందిన టీడీపీ కార్యకర్త రవి నాయక్ (24) గుండె పోటుతో మృతి చెందాడు. సోమవారం రాత్రి గుండె పోటు రావడంతో గుత్తి వైద్యశాలకు తరలించారు. చికిత్స చేయించి తిరిగి వస్తుండగా మృతి చెందాడు. రవినాయక్ ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు వెంకటస్వామి, జయరామ్ నాయక్ సంతాపం తెలిపారు. అనంతరం నివాళి అర్పించారు.

మీటర్ రీడర్లకు ఉపాధి చూపాలి



డీఈ హరికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లతో ఉపాధి కోల్పోతున్న మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈ కార్యాలయం వద్ద మీటర్ రీడింగ్ ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్ల పేరుతో కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం డీఈ హరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భీమరాజు, వెంకన్న, కల్లుబావిరాజు, వెంకటేష్, ఫిరోజ్, సుధాకర్, రామంజి, నవీన్, విజయ్, మహేష్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ బదిలీ



ఆలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఎస్సై జి.దిలీప్ కుమార్‌ను హొళగుందకు బదిలీ అయ్యారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది నవంబర్ 20న విధుల్లో చేరిన ఆయన 4 నెలల పాటు విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో ఆయనను బదిలీ చేస్తూ హొళగుంద ట్రైనింగ్ ఎస్సైగా వున్న షేక్ మహబూబ్ బాషాను ఆలూరుకు నియమించారు.

తుగ్గలి: జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్‌గౌడ్ బదిలీ ఆదోని యూపీఎస్‌కు అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు డీఎస్‌బీ నుంచి ఎస్‌సీ మల్లికార్జున బదిలీపై వచ్చినట్లు సమాచారం.

వైభవంగా దేవర



నేలతలమర్రిలో సుంకులమ్మ దేవర బోనాలు

దేవనకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గద్దెరాళ్ల, పల్లెదొడ్డి, నేలతలమర్రి, కె.వెంకటాపురం, దేవనకొండ, తదితర గ్రామాల్లో మంగళవారం సుంకులమ్మ, పెద్దమ్మ, దేవర నిర్వహించారు. బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు.

బెంచీలు ఏర్పాటు

- కలెక్టర్, డీఈవో ఆగ్రహంతో కదిలిన అధికారులు



బెంచీలను దించుతున్నసిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సోమవారం నేలపై కూర్చొని పరీక్షలు రాశారు. ఈ విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో వార్త ప్రచురితమైంది. కలెక్టర్ రంజిత్ బాషా, డీఈవో శ్యామ్యూల్ విద్యా శాఖ అధికారులపై మండిపడ్డారు. తక్షణమే బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి 300 బెంచీలను తెప్పించి పాఠశాలలో ఏర్పాటు చేశారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ నవ్య



శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఆలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. మంగళవారం ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామం ఆర్‌బీకేలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. శనగకు ప్రభుత్వం మద్దతు ధర రూ.5650లుగా నిర్ణయించిందన్నారు. అనంతరం తమ భూముల ఇబ్బందులు, ఈనాం భూములపై రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో భరత్ నాయక్, తహసిల్దార్ గోవింద్ సింగ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్వో అమరేశ్వర రెడ్డి, మార్కు ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు, కేడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

హొళగుంద, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద హ్యాట, చిన్నహ్యాట గ్రామాల్లో రీ సర్వేను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం ఆయన చిన్నహ్యాట గ్రామంలో రీసర్వేను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. రీసర్వేకు చేసేముందు రైతులకు సమాచారం ఇవ్వాలని, వారిసమక్షంలో పారదర్శకంగా సర్వే చేపట్టాలన్నారు. సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిజాముద్దీన్, రీ-సర్వే ఉపతహసీల్దార్ ముకుంద రావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్(ఇన్‌చార్జీ) బీ శ్రీనివాస నాయక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఆదోని, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ్ ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవసరాలకు తగినట్లు తగినంత మోతాదులో తాగునీటి సరఫరాకు గ్రామాల్లోని నీటి వనరులను పర్యవేక్షించాలన్నారు. కొరత ఏర్పడితే తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేశామ న్నారు. తాగునీటి సమస్య వస్తే 9704643236, 7892264314 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.

పనులు కల్పించకుంటే చర్యలు

తుగ్గలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కూలీలకు పనులు కల్పించకపోతే చర్యలు తప్పవని ఏపీడీ ఫక్కీరప్ప, ఏపీవో హేమసుందర్ హెచ్చరించారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ డిమాండ్ ఇచ్చిన ప్రతి కూలికి పనులు కల్పించాలన్నారు. పనులకు వచ్చిన వారి పేర్లను మాత్రమే మస్టర్‌లో వేయాలన్నారు. నేడు తుగ్గలిలో బహిరంగ చర్చావేదిక ఉంటుందన్నారు.

పిల్లలకు భోజనం పెట్టి పంపాలి

మద్దికెర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మధ్యాహ్నం భోజనం పెట్టి పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తాయన్నారు.

ఫుట్‌పాత్‌పై బంకులు



వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్

ఆదోని టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 35వ వార్డు అమరావతి నగర్‌లో ఫుట్‌పాత్‌పై బంకులను ఏర్పాటు చేశారని వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆరోపించారు ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ బంకులను పరిశీలించి తొలగించడమో, స్వాధీనం చేసుకోవడమో నిర్ణయం తీసుకొంటానని సమాధానం ఇచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మద్దికెర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి సూచించారు. మంగళవారం మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లోని తాగునీటి పథకాలను పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి పథకాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యదర్శులు శివకుమార్, సుధాకర్, ఉన్నారు.

అశ్వ వాహనంపై రంగనాథ స్వామి

మద్దికెర, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలిలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథుడు మంగళవారం అశ్వ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రధాన అర్చకుడు రంగస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సాయంత్రం అశ్వవాహనంపై ఉంచారు. ఈవో వీరయ్య, తదితరులు ఉన్నారు.

బిందె నీటికి బండెడు కష్టం

- పగిడిరాయి కొత్తూరు గ్రామంలో తాగునీటి కష్టాలు



బిందెలతో తాగునీరు తీసుకెళ్తున్న మహిళ

తుగ్గలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిరాయి మజరా గ్రామం పగిడిరాయి కొత్తూరు గ్రామంలో దాదాపు 2,500 మంది నివాసమున్నారు. అయితే ఈ గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. బిందె నీటి కోసం కిలో మీటర్ల దూరం వెళ్లి తాగునీటిని తెచ్చుంటున్నారు.

పనిచేయని తాగునీటి బోర్లు

గ్రామాల్లో తాగునీటి బోర్లు పని చేయడం లేదు. దీంతో పక్క గ్రామమమైన బొళ్లవానిపల్లె నుంచి తాగునీటి సరఫరా చేస్తుండేవారు. అయితే కొద్ది రోజుల నుంచి అక్కడి నుంచి కూడా నీరు రావడం లేదు.

వ్యవసాయ బోర్లే శరణ్యం

గ్రామంలో నీటి పథకాలు పనిచేయకపోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్దకు వాహనాలు, ఎడ్లబండ్లు, బిందెలు భూజానకెత్తుకుని నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 9 రోజుల నుంచి గ్రామస్థులు అవస్థలు పడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



తొమ్మిది రోజుల నుంచి తాగునీరు అందడం లేదు. గ్రామ శివార్లలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమంలోని తోటలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం.

- చక్రపాణి, పగిడిరాయి కొత్తూరు

సమస్య పరిష్కరిస్తాం

పగిడిరాయి కొత్తూరులో తాగునీటి ఎద్దడిని పరిష్కరిస్తాం. త్వరలో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

- నరేష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి.

రహదారులు బాగుపడ్డాయి



పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్

ఆలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రహదారులు బాగుపడ్డాయని ఆలూరు టీడీపీ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి నిర్మాణం పనుల ను పరిశీలించారు. ఎంపీ బస్తీపాటి నాగరాజు, కలెకర్ రంజిత్ బాషా, పత్తిపాడు ఎమ్మెల్యే రావ హాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సహకా రంతో రోడ్డు పనులు పూర్తయ్యాయన్నారు. ప్రజలు, వ్యాపారులు, వాహన దారుల ఇబ్బందులు గమ నించి అధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు పూర్తి చేయించారన్నారు. ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ అధ్యక్షులు కిష్టప్ప, బీజేపీ నాయకులు రవీంద్ర రావ్, టీడీపీ నాయకులు నరసప్ప, తిమ్మయ్య, కొమ్ము రామాంజినే యులు, సురేంద్ర, మాసాలా జగన్, కొమ్ము రాజు, వన్నూర్ వల్లి, రాము యాదవ్, గోవింద్ పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సారాను బహిష్కరించండి

వెల్దుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలను బహిష్కరించాలని ఎక్సైజ్ సీఐ మంజుల పిలుపునిచ్చారు. మంగళవారం మండ లంలోని బుక్కాపురం, కలగొట్ల, పుల్లగుమ్మి, రామళ్లకోట, ఎల్.తండా, పిక్కినివానిపల్లెలో సారా నష్టాలపై అవగాహన కల్పించారు. సారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 నిర్వహిస్తోందని, సారా తయారీ మాను కునే వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది నాగయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులను మంగళవారం ఎమ్మెల్యే విరుపాక్షి పరిశీలించారు. రహదారి పనులు పూర్తి చేయాలని పలుమార్లు తాను కలెక్టర్, నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

అదనపు వసూళ్లను అరికట్టండి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

ఆదోని, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అదనపు వసూళ్లను అరికట్టాలని జనసేన మండల అధ్యక్షుడు ఎం.తాహెర్ వలి కోరారు. మంగళవారం సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యాలయంలో ఈ స్టాంప్ ధర రూ.100లకు ఇవ్వాల్సి ఉండగా అదనంగా రూ.30లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశించారు. ఆదోని ఎమ్మెల్యే చెప్పినా ఎందుకు పెడచెవిన పెడుతున్నారన్నారు. మహేష్, భాషా, కృష్ణరెడ్డి, రామిరెడ్డి, మంచాల రాజు, గోవిందు, శ్రీనివాసులు, నబీ రసూల్, వీరేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆదోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ



మంత్రాలయం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ పద్మజ అన్నారు.

ప్రశ్న: డివిజన్‌లో తాగునీటి సమస్య ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: డివిజన్‌లో 26 సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు, 24 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, టీబీఎల్ఎల్‌సీ కాలువ కింద 18, హెచ్‌హెచ్‌సీ 4, ఫిల్టర్‌బెడ్‌లు 4 ఉన్నాయి. అధికారులను అప్రమత్తం చేశాం.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించారు?

జవాబు: 415 గ్రామాలు ఉండగా 27 గ్రామాల్లో సమస్య ఉంది. ఈ గ్రామాలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

ప్రశ్న: జలజీవన్ మిషన్ పనులు ఏవిధంగా జరుగుతున్నాయి?

జవాబు: గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకం పనుల్లో 25 శాతం కన్న తక్కువగా పనులు చేసి ఉంటే ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. 25 శాతం కంటే ఎక్కువ ఉంటే బిల్లులు మంజూరుచేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నదితీర గ్రామాల ప్రజల దాహార్తి ఎలా తీరుస్తారు?

జవాబు: నదితీర గ్రామాల్లో బోర్లు వేయిస్తాం. తద్వారా కనెక్షన్ ఇచ్చి గ్రామాలకు సరఫరా చేసేందుకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చాం.

ప్రశ్న: ఈవేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కొంటారు?

జవాబు: మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. గ్రామాల్లో ఇప్పటి నుంచే తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామ పంచాయతీ, టీబీ డ్యాం అధికారులంతా సమష్టిగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

అన్ని సర్వేలు పూర్తి చేయాలి

నోడల్ అధికారి నారాయణమూర్తి


మాట్లాడుతున్న నారాయణమూర్తి

మంత్రాలయం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూచించిన సర్వేలన్నీ పక్కాగా పూర్తి చేయాలని నోడల్ అధికారి నారాయణమూర్తి ఆదేశించారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో రాధ ఆధ్వర్యంలో మండలంలోని 20 గ్రామ సచివాలయాల సిబ్బందితో సర్వేలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారి నారాయణమూర్తి, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన బీ-4, ఎంఎస్ఎంఈ, చైల్డ్‌విత్‌వుట్ ఆధార్, పీఏసీసీ వేలిముద్రలు, ఎన్‌పీసీఐ, పీజీఆర్ఎస్ సర్వే పనులు పూర్తి చేయాలని సూచించారు. కొంతమంది వీఆర్‌వోలు నిర్లక్ష్యం చేస్తున్నారని, తమ విధులు నిర్వర్తిస్తున్నే సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దాదాపు రెండు గంటలపాటు నిర్వహించిన సమావేశంలో కనీసం ఉద్యోగులు కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో చాలా మంది నిలబడ్డాల్సి వచ్చింది. కనీసం తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో వచ్చిన సిబ్బంది ఇబ్బంది పడ్డారు. సమావేశంలో గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, లక్ష్మీదేవి, వీరేష్, ఇస్రత్‌భాషా, మహేష్, రామకృష్ణ, రజేష్, రాముడులు పాల్గొన్నారు.

'వందశాతం పన్నులు వసూలు చేయాలి'

గోనెగండ్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇంటి , తాగునీటి, దుకాణాల పన్నులు వందశాతం వసూలు చేయాలని ఈవోఆర్‌డీ అనంతశయన, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ సూచించారు. మంగళవారం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బులు, బట్టలు, చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఇంటి పన్నును మార్చిలోగా కట్టాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దకడుబూరు , మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకుడు ముక్కరన్నపై చర్యలు తీసుకోవాలని బాధితులు కురువ కృష్ణ, కురువ సోము, పింజారి మోదీన్‌పీర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ప్రియదర్శినిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగులపాడు గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 165లోని 2.66 ఎకరాలు, 164/ఏ ఫైవ్‌లో 1.40ఎకరాలకు సంబంధించిన రికార్డులను మార్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. రీ సర్వే సమయంలో రెవెన్యూ అధికారులకు ముడుపులు ఇచ్చి తన పలుకుబడితో రికార్డులను మార్చారన్నారు. అలాగే తన భార్యపై రిజిస్ట్రేషన్ చేయించి అనంతరం కుమారుడికి దానవిక్రయం చేయించాడన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేతల చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటాలకు టీడీపీ నాయకులు కదిరికోట అదెన్న ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణను అమలు చేసి, ఎస్సీ 59 ఉప కులాలకు సామాజిక న్యాయం పాటించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబుదేనని అదెన్న అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రోజా ఆర్ఫ్ ఉశేని, మార్కు, సాల్మన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మార్పీఎస్: ఎస్సీ వర్గీకరణకు మంత్రి వర్గం ఆమోదం తెలుపడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవేంద్ర, చిన్న బీమన్న, రంగన్న పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

పెద్దకడుబూరు , మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీకలబెట్ట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తోవి నరసయ్య (35) బ్రెయిన్ స్ట్రోక్‌తో మంగళవారం మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు వైద్యశాలలో మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తీసుకువచ్చారు. టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

పెద్దకడుబూరు , మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబదహాల్ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం నాయకులు ఖాజా కోరారు. మంగళవారం జడ్పీసీఈవో నారసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలకు తాగునీటిని అందించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కంబదహాల్ గ్రామంలో తాగునీటి ట్యాంకులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉప్పునీటిని తాగలేక ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.


జడ్పీసీఈవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకుడు

బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి



బ్రిడ్జిని చూపుతున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కురువ కళ్యాణ మండపం సమీపంలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిగా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, కమిటీ సభ్యులు రాముడు మాట్లాడుతూ బైపాస్ రోడ్డు, తాయమ్మ కాలనీ, ముబారక్ నగర్, దోబీఘాట్ ఏరియాల్లో అర్ధరాత్రి నీళ్లు వస్తున్నాయన్నారు. నీళ్ల కోసం రాత్రంతా వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాముడు, మాదన్న, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి ధర పతనం

● మార్కెట్‌లో అందని గిట్టుబాటు ధర
● వీధుల్లో కేజీల ప్రకారం విక్రయిస్తున్న రైతులు

గోనెగండ్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఉల్లిధర తగ్గుముఖం పట్టింది. దీంతో సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. గోనెగండ్ల మండలంలో ప్రస్తుతం దాదాపు 2000 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ఎకరాకు పెట్టుబడి దాదాపు రూ.80వేల నుంచి రూ. 90వేల వరకు వస్తుందని రైతులు తెలుపుతున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింట ధర రూ. 500 నుంచి రూ.1500 లోపే ధర పలుకుతోంది. నాణ్యత పట్టి ధర పలుకుతుంది. కనిష్ఠ ధర రూ. 500, గరిష్ఠ ధర రూ. 1500 లోపే పలుకుతుంది. అయితే సరసరి మీద ఉల్లి పంట క్వింటం రూ.600 మించి మార్కెట్‌లో ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌కు పోతే కనీస ధర కూడా పలకక పోవడంతో పాటు రవాణా ఖర్చులకు కూడా రావని, చేసేది లేక రైతులు పొలాల దగ్గరనే వ్యాపారులకు క్వింట ధర రూ. 500 నుంచి రూ. 700 లోపే విక్రయిస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఆటోల్లో ఉల్లి బస్తాలను వేసుకొని వీధుల్లో తిరుగుతూ రూ. వందకు ఆరు కేజీల ప్రకారం విక్రయిస్తున్నారు. 50 కేజీ బస్తా రూ. 750 నుంచి రూ. 850 అమ్ముతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా సగానికి పడిపోయింది. ఎకర 300 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 200 బస్తాలకు మించి దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు. కష్టపడి పండించిన పంటను వీధుల్లో తిరుగుతూ కేజీ ప్రకారం అమ్మలు జరుపుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్లకు చెందిన బాషా అనే రైతు ఉల్లి పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పోవడంతో ఇంటి దగ్గరే పంటను ఆరబెట్టుకున్నారు. నేడు రేపు ధర పెరుగుందనే ఆశాతో ఉల్లి రైతులు ఉన్నారు.


ఆటోలో ఉల్లిని విక్రయిస్తున్న రైతులు

ఘనంగా సుయతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 12వ మహా సమారాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మంత్రాలయం నవనిర్మాణ శిల్పిగా పేరొందిన ప్రస్తుత పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు పీఠం ఇచ్చిన గురువు సుయతీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి ఆభరణాలతోపాటు పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయానుమానంగా అలంకరించారు. యాగశాలలో పీఠాధిపతి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ డాక్టర్ రాజాఎస్‌గిరిరాజాచార్, ఎస్ఎన్ వెంకటేశాచార్, ఎస్ఎన్ రఘునందన్‌ఆచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఏఈ బద్రినాథ్, వాధిరాజాచార్, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, విజేంద్రచార్, అనంతపు రాణిక్, రవికులకర్ణి, జేపీ స్వామి, వాదేంద్రచార్, జేపీ స్వామి, డీఎం ఆనందరావు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

● **ఆకట్టుకున్న ప్రవచనాలు:** సుయతీంద్రతీర్థుల ఆరాధనలో భాగంగా యాగశాలలో రాయచూరు చెందిన విద్వాన్ ప్రాణేష్ కురిడి, రాయచూరు చెందిన విద్వాన్ వరధేంద్ర గంగఖేడ్, బెంగుళూరు చెందిన విద్వాన్ పండిత్ శ్యామాచార్ ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వీరికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడొద్దు: డ్వామా పీడీ

పెద్దకడుబూరు , మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడొద్దని డ్వామా పీడీ వెంకటరమణ ఆదేశించారు. మంగళవారం పెద్దకడుబూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో నాగరాజుస్వామి ఆధ్వర్యంలో ఏపీడీ లోకేశ్వర్ అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకడుబూరు మండలంలోని వివిధ గ్రామాల్లో 1.4.2023 నుండి 31.3.2024 వరకు 717 పనులకు రూ.29.40 కోట్ల ఉపాధి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏలకు సంబంధించిన పనులు చేపట్టారన్నారు. ఈ పనులపై సామాజిక బృందం 1.3.2025 నుంచి 17.3.2025 వరకు ఎస్ఆర్‌పీ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారన్నారు. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవినీతి అక్రమాలను పంచాయతీల వారిగా వెల్లడించారు. ఉపాధి పనుల్లో జరిగిన అవినీతి సొమ్ము రూ.3,17,607లను తక్షణమే రికవరీ చేయాలని, లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే జరిమానా రూపంలో విధించిన రూ.93వేలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో బినామీలు లేకుండా ఖచ్చితమైన కొలతలతో పనిచేయిస్తే మంచి వేతనం లభిస్తుందన్నారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ పీడీ మాదవీలత, ఏపీవోలు చంద్రశేఖర్, రామన్న, ఈసీ ఖాదర్‌బాషా, టీఏ, ఎఫ్ఏ, డీఆర్‌పీ, సామాజిక తనిఖీ బృందం పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

విద్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఏడీఈకి వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ కార్మికులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడియర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, విద్యుత్ మీటర్ రీడియర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, డివిజన్ నాయకులు వీరేష్ కోరారు. మంగళవారం పట్టణంలో విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం విద్యుత్ ఏడీఈ నాగేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరేష్, వీరశేఖర్, ఉరుకుందు, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ కార్యదర్శి విజయేంద్ర, కుమారస్వామి, నరసప్ప, చంద్రశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల అరెస్టు దారుణం

గోనెగండ్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా విజయవాడ ధర్నాచౌక్ దగ్గర ధర్నా నిర్వహించి భోజనానికి వెళ్తున్న డప్పుకళాకారులను, కేవీపీఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ అన్నారు. మంగళవారం విజయవాడలో నాయకులను అరెస్టు చేయడంతో గోనెగండ్ల డప్పుకళాకారులు స్థానికంగా నిరసన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మారేష్, మునియప్ప, రంగస్వామి, మద్దిలేటి, హనుమంతు, రామన్న, ముత్యాలు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలి

కోసిగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు గుర్తింపు కార్డు కోసం వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. మంగళవారం కోసిగిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఖచ్చితంగా యూనిక్ ఐడీని నమోదు చేసుకోవాల న్నారు. రైతు గుర్తింపు కార్డు ఉంటేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రైతుకు సంబంధించిన పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా జ్వరాలు వ్యాపిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి నూకరాజు అన్నారు. మంగళవారం కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల వైద్య అధికారి గోవిందమ్మ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం రాంపురం గ్రామంలో బోధకాలు సోకిన వ్యక్తి వివరాలు సేకరించారు. వైద్యులు సురేష్, సబ్ యూనిట్ అధికారి నరసింహులు, సూపర్‌వైజర్ మాధవ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

పెద్దకడుబూరు , మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని సచివాలయ ఇంజినీర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి రంగన్న కోరారు. మంగళవారం స్థానిక ఏఈ మల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రావణి, మైత్రి, మాధవిలత, వంశి, హర్ష, రాజు, ఉరుకుందు, భీమరాయుడు పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో పెరిగిన నీటి మట్టం

గోనెగండ్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువకు నీటి విడుదల పెరిగింది. మంగళవారం గోనెగండ్ల సెక్షన్‌కు 130 క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో గోనెగండ్ల, కోడుమూరు ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజుల క్రితం గోనెగండ్ల సెక్షన్‌కు నీటిని విడుదల నిలిచిపోయింది. కేవలం 20 క్యూసెక్కుల లోపే నీరు అందేది. దీంతో రైతులు ఆందోళన చెందారు. మంగళవారం ఉదయం గోనెగండ్ల సెక్షన్‌కు తుంగభద్రనీరు విడుదల పెరగడంతో గోనెగండ్ల, కోడుమూరు ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పది రోజులుగా సాగునీరు కోడుమూరు సెక్షన్‌కు అందకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుతం ఎల్లెల్సీకి విడుదల అయిన 130 క్యూసెక్కుల విడుదల అయింది. ఇందులతో కోడుమూరుకు 103 క్యూసెక్కులు విడుదల చేసి మిగిలిన వాటలో ఉన్న 27 క్యూసెక్కుల నీటిని గోనెగండ్ల సెక్షన్ భూములకు, గోనెగండ్ల, అలువాల తాగునీటి పథకాలైన ఎస్ఎస్ ట్యాంక్‌లకు మళ్లించారు. అధికారులు మాత్రం మార్చి చివరి వరకు ఎల్లెల్సీ నీటి విడుదల ఉంటుందని తెలుపుతున్నారు. ఈ రబీ సీజన్‌లో గోనెగండ్ల సెక్షన్‌కు 175 క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉంది. అయితే మంగళవారం 130 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల అయ్యాయి.


గోనెగండ్ల ఎల్లెల్సీలో పారుతున్న నీరు

స్వర్ణ పల్లకిలో స్వామివారు..


స్వర్ణ పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

మంత్రాలయం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి వైభవంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలూరు సభను జయప్రదం చేయండి: బీజేపీ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆలూరులో ఈ నెల 22న నిర్వహించనున్న బీజేపీ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ తోగట నరసింహులు కోరారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో జగ్గాపురం చిన్న ఈరన్న, జట్టప్ప, జడేసాబ్ పాల్గొన్నారు.

21న కోసిగిలో వేలం

కోసిగి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ పంచాయతీ పరిధిలోని వారపు సంత మార్కెట్, బండిమెట్ట, చిన్నకబేళా, పెద్దకబేళా వేలం ఈనెల 21న కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుమారి అయ్యమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న ట్లు పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1.4.2025 నుంచి 31.03.2026 వరకు విక్రయాలు చేసుకోవచ్చన్నారు. డిపాజిట్ కట్టాల్సి ఉంటుందన్నారు. వేలాలు దక్కించుకున్న వారు నగదును చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఆదోని



మంత్రాలయం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ అన్నారు. మంగళవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: ఆదోని డివిజన్‌లో వేసవి కాలంలో తాగునీటి సమస్య ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: డివిజన్‌లో 26 సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు, 24 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, టీబీఎల్ఎల్‌సీ కాలువ కింద 18, హెచ్‌హెచ్‌సీ 4, ఫిల్టర్‌బెడ్‌లు 4 ఉన్నాయన్నారు. వీటికి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అధికారులను అప్రమత్తం చేశాం.

ప్రశ్న: డివిజన్‌లో ఎన్ని గ్రామాల్లో అధిక తాగునీటి సమస్యను గుర్తించారు?

జవాబు: 415 గ్రామాల్లో 27 గ్రామాలను గుర్తించి నీటి ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తాం.

ప్రశ్న: జలజీవన్ పథకం కింద తాగునీటి పనులు ఏవిధంగా జరుగుతున్నాయి?

జవాబు: గత ప్రభుత్వంలో జలజీవన్ పథకం కింద చేపట్టిన పనుల్లో 25 శాతం తక్కువగా నిర్మాణం పనులు జరిగి ఉంటే ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. 25 శాతం కంటే ఎక్కువ పనిచేసిన నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేసి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నదితీర గ్రామాల్లో దాహార్తిని ఎలా తీరుస్తారు?

జవాబు: నదితీర గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం. బోర్లు వేయిస్తాం. తద్వారా కనెక్షన్ ఇచ్చి గ్రామాలకు సరఫరా చేసేందుకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చాం.

ప్రశ్న: ఈవేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కొంటారు?

జవాబు: మార్చినెల ఆఖరిలోనే ఎండలు మండుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇప్పటి నుంచే తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామ పంచాయతీ, టీబీ డ్యాం అధికారుల సమష్టిగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఈకేవైసీ చేయించాలి: డీఎస్‌వో

ఎమ్మిగనూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం, మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఈకేవైసీ చేయించుకోని వారందరిని గుర్తించి వెంటనే ఈకేవైసీ చేయించాలని డీఎస్‌వో రాజారఘువీర్ రేషన్ డీలర్లను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పాత తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండంలో దాదాపు 23వేల యూనిట్లకు ఈకేవైసీ నమోదు కాలేదన్నారు. వారందరిని గుర్తించి డీలర్లు ఈనెల 25లోపు పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ నమోదు కాకపోతే రేషన్‌తో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా పోతాయన్నారు. ఏవైన సమస్యలు ఉన్నట్లైతే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈకేవైసీ నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈనెల చివరికి నివేదికను జిల్లా కేంద్రానికి పంపాలని స్థానిక అధికారులకు సూచించారు.


మాట్లాడుతున్న డీఎస్‌వో రాజారఘువీర్

చేనేతలకు ఉచిత విద్యుత్‌పై హర్షం: టీడీపీ


సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చేనేతల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ చేనేత విభాగం నాయకులు మిన్నప్ప, దేవేంద్ర, నరసప్ప, భీమేష్, నరసింహులు, కామర్తి మహేష్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చేనేతలకు ఆర్థిక భారం తగ్గటంతో పాటు, చేనేత రంగాభివృద్ధికి ఊతమిస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చేనేతలు, చేనేతకార్మికసంఘాలు, ప్రతినిధులు, చేనేతకార్మికులు స్వాగతిస్తున్నాయని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు, చేనేత, జౌళిశాఖ మంత్రికి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి వారు కృతజ్ఞతలు తెలిపారు.

గణాంకాలకు రైతులు సహకరించాలి

పెద్దకడుబూరు , మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ అధికారులు చేపట్టే వంకలు, వాగులు, బోర్లు, భూవిస్తీర్ణానికి చేపట్టే గణాంకాలకు రైతులు సహకరించాలని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని కోరారు. మంగళవారం ఆమె రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల సహాయ గణాంకాధికారి వెంకటేశ్వర్లు సూచనలు పాటిస్తూ అన్ని గ్రామాల్లో వీఆర్వోలు సర్వేలు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు- కమ్మళదిన్నె రోడ్డు వేయండి

ఎమ్మిగనూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం నుంచి కమ్మళదిన్న గ్రామం మీదుగా కోసిగికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని, ఈ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆర్‌పీఐఎఫ్ జిల్లా కార్యాదర్శి ఖాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలులో ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎస్ఈ సిద్ధారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఈ మాట్లాడుతూ త్వరలో రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలుస్తారని చెప్పారు.